క్లుప్తంగా

గ్రామంలోనే ఆధార్ సేవలు

పుల్లంపేట : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ సెంటర్‌ను గురువారం రంగంపల్లె సచివాలయంలో ఏర్పాటు చేశారు. పది సంవత్సరాలు పైబడిన వారికి ఆధార్ అప్‌డేట్‌ను, నూతనంగా ఆధార్ కార్డు దరఖాస్తు చేసుకునేవారికి సచివాలయం వద్దే ఆధార్ సేవలు లభించడం పట్ల రంగంపల్లె గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆధార్ సేవల కోసం పుల్లంపేటకు వెళ్లేవారమని, ప్రస్తుతం మా గ్రామంలోనే ఆధార్ సేవలు లభించడంతో సుధూర ప్రాంతాలకు వెళ్లే అగచాట్లు తప్పాయని చెప్పారు. జగనన్న ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి ఇండ్ల వద్దకే ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రవేశపెట్టడం ఎంతో గొప్ప విషయమని గ్రామ ప్రజలు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

ఆధార్ కేంద్రం తనిఖీ



ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

నందలూరు(రాజంపేట) : మండలంలోని పాటూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ శేఖర్ నాయక్ గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన ఆధార్ కార్డులో పలు లోపాలపై వచ్చిన ప్రజలకు వివరించారు. ఆధార్ ప్రక్రియ నిర్వహిస్తున్న సోని శామ్యూల్‌ను ఎంపీడీఓ అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ జానకీ రామచంద్రన్, వీఆర్‌ఓ లక్ష్మయ్య, ఎంపీఈఓ సాయి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రామసుబ్బమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఆకేపాటి

వీరబల్లె (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని గడికోట కస్పాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగిరెడ్డి తల్లి (114 సంవత్సరాల శతాధిక వృద్ధురాలు) రామసుబ్బమ్మ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. అంత్యక్రియల్లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఆయన తోపాటు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, జిల్లా బీసీ నాయకుడు నాగభూషణం, సర్పంచ్‌లు గోపినాథరెడ్డి, నాగిరెడ్డి, కృష్ణయ్య, ఈశ్వరయ్య, న్యాయవాది పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, తాటిగుంట్ల లోకనాథరెడ్డి, ఆరెం రెడ్డి, సుబ్బరామరాజు పాల్గొన్నారు.

24 నుంచి మహాభారత యజ్ఞం

సంబేపల్లె : ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ వరకు మహాభారత యజ్ఞం మండలంలోని గుట్టపల్లె శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రారంభంకానున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 రోజులపాటు మహాభారత యజ్ఞాన్ని దాతల సహకారంతో నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వేడుకలలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత 'చింతకాయపల్లె'

నందలూరు(రాజంపేట) : కుంపిణీపురం శ్రీభోగా ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా మదనమోహనపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో చింతకాయపల్లి జట్టు విజేతగా నిలవగా, రన్నరప్‌గా కుంపిణీపురం జట్టు నిలచింది. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ. 20 వేలను నల్లతిమ్మయ్యగారిపల్లి సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి అందజేయగా రెండో బహుమతి రూ. 15 వేలను గుగ్గిళ్ల ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా యానాది, శివకోటి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, కడప శ్రీనివాసులు, చుక్కా రమణయ్య, కడప హరి, శివ యాదవ్, ఉపేంద్ర, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : చౌక దుకాణాలకు సరఫరా చేసే నిత్యావసర సరుకులలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి కె.రఘురాం పేర్కొన్నారు. మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లె పౌర సరఫరాల గోదామును గురువారం ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాములో నిల్వ ఉన్న బియ్యం, చక్కెర, కందిబేడలు, గోధుమపిండి, మధ్యాహ్న భోజనం పథకం కింద సరఫరా చేసే రాగి పిండి, బెల్లం పొడి తదితర వస్తువుల నాణ్యతలు, తయారీ తేదీ, గడువు సమయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి చౌక దుకాణానికి బియ్యంను కచ్చితంగా తూకాలు వేసి పంపిణీ చేయాలని గోదాం ఇన్‌చార్జ్‌ను ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గోదాం ఇన్‌చార్జ్ మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు.. ప్రతి ఇంటా చిరునవ్వులు

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- సేవలతో ప్రజల మన్ననలు పొందాలి
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు

చిన్నమండెం : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జరిగిన చిన్నమండెం మండల పరిధిలోని వలంటీర్లకు వందనంలో భాగంగా వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా నాల్గవ ఏడాది అవార్డులతో సత్కరిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వివక్ష, అవినీతికి తావు లేకుండా వలంటీర్ల వ్యవస్థ పనిచేయాలని సూచించారు. గ్రామ వార్డు వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు.

57 నెలల్లో విప్లవాత్మక మార్పులు

57 నెలల జగనన్న పాలనలో కనీవినీ ఎరుగని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. జగనన్న ప్రతి అక్క చెల్లెమ్మ హృదయాన్ని తట్టారని, ప్రతి రైతన్న మనసులో, ప్రతి అవ్వా తాత చిక్కటి చిరునవ్వుల్లో, చదువుకుంటున్న ప్రతి పిల్లాడి మనసులో నిలిచారన్నారు. సంక్షేమ పథకాలను అందుకున్న ప్రతి కుటుంబంలోని సభ్యుడు జగనన్నకు ఒక స్టార్ క్యాంపెయినర్‌గా బయటకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

ఎన్నికలు జగన్ విశ్వసనీయతకు.. బాబు వంచనకు మధ్యే

రాబోయే ఎన్నికలు మాట నిలబెట్టుకున్న జగన్‌కు – మాట తప్పడం అలవాటుగా మార్చుకున్న చంద్రబాబుకు మధ్యే అని పేర్కొన్నారు. ఈ యుద్ధం విశ్వసనీయతకు, వంచనకు మధ్య జరగబోతోందన్నారు. బూటకపు హామీలతో చంద్రబాబు ప్రజలను నమ్మించి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, చంద్రబాబు హామీలను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధి చూసి ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేక పొత్తుల కోసం పాకులాడుతున్నారని అన్నారు. పడిపోయిన చంద్రబాబు గ్రాఫ్‌ను పైకి లేపేందుకు దుష్టచతుష్టయం వైఎస్సార్‌సీపీ నాయకులపై విషపు రాతలను రాస్తోందని వీటిని తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల యుద్ధంలో పేదవాడి భవిష్యత్‌ను, మధ్య తరగతి బతుకులను మార్చేందుకు ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు.

ఫ్యాన్ ఇంట్లో.. సైకిల్ బయట.. తాగేసిన గ్లాసు సింక్‌లో..

వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు వారి చిరునవ్వుల మధ్య ఆ అవ్వాతాతలకు, అక్కచెల్లెమ్మలకు ప్రచార సారథులు చెప్పాలని ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలి. సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలని ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా చెప్పాలని కోరారు.

జగన్ ఎన్నికల కురుక్షేత్రంలో అర్జునుడు

ప్రతి అక్క చెల్లెమ్మ, అన్న, తమ్ముడు, అవ్వాతాతలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైన పాండవ సైన్యం ప్రతి లబ్ధిదారుడు సేనాధిపతుల్లా కనిపిస్తుంటే.. అక్కడ కౌరవ సైన్యం ఉందన్నారు. వారి సైన్యంలో దుష్టచతుష్టయం ఉందని వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు మోసపూరిత వాగ్దానాలు, ఎత్తులు, పొత్తులు, చిత్తులు పద్మ వ్యూహంలా కనిపిస్తోందని, పద్మవ్యూహంలో చిక్కుకొని బలైపోవడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు వైఎస్ జగన్ అర్జునుడని తెలియజేశారు. అనంతరం జై జగన్, జయహో వలంటీర్ అంటూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నినాదాలు చేస్తూ వలంటీర్లలో ఉత్సాహాన్ని రేకెత్తించారు. అనంతరం వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, నిరంజన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఎంపీటీసీలు ఏజాస్ అలీఖాన్, రమేష్, శ్యామ్ చంద్ర, శ్రీరాములు, రమణ, సర్పంచులు నజీర్‌బాషా, లక్ష్మీరెడ్డి, లోకేశ్వరరెడ్డి, ముసల్‌రెడ్డి, అఫ్రోజ్, మంజుల, దామోదర్, మాజీ సర్పంచులు సలీం, అమ్మాజీ, జేసీఎస్ మండల కన్వీనర్ అంజనప్ప, పార్టీ నాయకులు గురివిరెడ్డి, శేషారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి, గంగులయ్య, రాయుడు, మురళీ, జేసీబీ శేఖర్, చంద్రపాల్, సుధాకర్, దశరథ, ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి



తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి సురేష్‌బాబు

రాజంపేట రూరల్ : బొప్పాయి సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణలో చొరవ చూపాలని మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు కోరారు. మండల పరిధిలోని ఆకేపాడు, మందపల్లి, పోలీ రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగు చేసిన బొప్పాయి పంటలను ఉద్యాన అధికారి సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. అనంతరం రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకుముడత వైరస్, మొజాయిక్ వైరస్ వంటి తెగుళ్లను ఆదిలోనే గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బొప్పాయి సాగు చేసే రైతులు రక్షక పంటలుగా మొక్కజొన్న, జొన్న పంటను పొలం చుట్టూ నాలుగు వరసలు సాగు చేయాలని సూచించారు. పొలంలో ఎకరానికి 10 నుంచి 12 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పంట మార్పిడితో తెగులును నివారించవచ్చని తెలియజేశారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించి అజాడిరెక్టిన్ 3000 పీపీఎంను 3 మి.లీ లేదా డైమిథోయెట్ 2 మి.లీ, ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ మందులను పిచికారీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ పూర్ణచంద్ర, వీహెచ్‌ఏలు చెంగలరాయుడు, శివప్రసాద్, సుఫియాన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి



పరీక్షా సామగ్రిని ఇస్తున్న రేంజర్ కళావతి

సిద్దవటం : విద్యార్థులు లక్ష్య సాధన కోసం కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పార్వతీపురంలోని శ్రీ ఎస్పీబీవీడీ సభా హైస్కూల్‌లో గురువారం సాయంత్రం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దవటం రేంజర్ కళావతి హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అలాగే ఈ పాఠశాల పూర్వపు విద్యార్థులు అయిన తిరువీదుల పెంచలయ్య రూ. 10,116, ఎం.ఎల్. వెంకటసుబ్బయ్య రూ. 3,116, యు.హరిప్రసాద్ విద్యార్థులకు పరీక్షల విద్యాసామగ్రి అయిన పెన్, ప్యాడ్, జామెంట్రీ బాక్స్, ఫైల్‌లను పాఠశాలకు ఇచ్చారు. పరీక్ష సామగ్రిని రేంజర్ కళావతి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం రేంజర్ కళావతిని పాఠశాల కరస్పాండెంటు ఎం.డి. మధుసూదన్, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ నలంద స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఎం.డి. ప్రసాద్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

28న శ్రీ భద్రాద్రి రాముడి కల్యాణం

రాయచోటి టౌన్ : ఈ నెల 27న శ్రీ భద్రాద్రి రాముడి రథోత్సవం, 28న జరిగే కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని రాయచోటి అభి కన్వెన్షన్ అధినేత బెల్లం రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు కోరారు. గురువారం వారు కన్వెన్షన్ హాల్ వేదికగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో ఏ విధంగానైతే స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారో అలాంటి అలంకరణతో రాయచోటిలో స్వామివారి కల్యాణం ఘనంగా జరుపనున్నట్లు తెలిపారు. 27న స్వామి వారి భద్రాచలంలోని ప్రధాన ఆలయంలో స్వామి వారి మూలవిరాట్టు నమూనా మూర్తిని వాహనంలో ప్రతిష్ఠించి పట్టణంలోని అభి కన్వెన్షన్ నుంచి పట్టణంలో భారీ ఊరేగింపు చేపడతామన్నారు. 28వ తేదీ ఉదయం 10:30గంటలకు జరిగే కల్యాణోత్సవం ఉంటుందన్నారు. భద్రాచలానికి వెళ్లి స్వామి వారి కల్యాణాన్ని వీక్షించలేని భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలకు లోబడి కేంద్రాలను నడపాలి



కేంద్రాల నిర్వహణపై సూచనలు చేస్తున్న దేవ శిరోమణి

రాజంపేట రూరల్ : ప్రైవేటు ఆసుపత్రులు, స్కాన్ సెంటర్స్, ల్యాబ్స్, డయాగ్నస్టిక్స్ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడపాలని జిల్లా డిప్యూటీ డెమో దేవశిరోమణి ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, ఆయా కేంద్రాల వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలను నిర్వాహకులు రోజువారీ, నెలవారీ నివేదికలను ప్రభుత్వానికి క్రమం తప్పకుండా నివేదించాలని చెప్పారు. ఏపీపీఎం సీఈ 2022, పీసీపీఎన్ డీటీ చట్టం 1994 ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, స్కాన్ సెంటర్స్, ల్యాబ్స్, డయాగ్నస్టిక్స్ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొని నడుపుకోవాలని సూచించారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని తెలియజేశారు. రోగులకు అందించే చికిత్సలకు తగిన బిల్లులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, ఎంపీహెచ్‌ఈఓ శివారెడ్డి, సీనియర్ సహాయకులు యు.సిద్ధిరామయ్య, దాసు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ఉండాలి



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

రాయచోటి టౌన్ : నాణ్యతా ప్రమాణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని రాయచోటి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ విద్యార్థులకు సూచించారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వస్తువు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. అనంతరం భారత ఆర్థిక వ్యవస్థలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతులతోపాటు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మొదటి బహుమతి ఎస్. మహమ్మద్ అనాస్, ద్వితీయ బహుమతి బి.గంగాధర్, తృతీయ బహుమతి కె.దీపక్‌లు గెలుపొందారు. అలాగే ప్రోత్సాహక బహుమతిని ఎస్.అలియాకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మెంటర్ వి.ప్రసన్న కుమారి, బాహ్యగురువు ఎం. రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు జి.రామకృష్ణ, జె.చిరంజీవి, కె.గీతాంజలి, ఎం.సంధ్య, కె.రేవతి, బి.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా సమాజసేవ

రాజంపేట రూరల్ : విద్యతోపాటు సమాజసేవను విద్యార్థులు బాధ్యతగా భావించి సేవలందించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.పురుషోత్తం విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో 7రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు చివరి రోజు అయిన గురువారం ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి పురుషోత్తం కలసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ సేవ చేయటం ద్వారా సమాజం పట్ల బాధ్యతను విద్యార్థులలో పెంపొందించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అనర్హులను ఓటర్లుగా నమోదు చేస్తే చర్యలు

చిట్వేలి : కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అనర్హులను ఓటర్లుగా నమోదు చేస్తున్నారని, అటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జ్ఞానేశ్వరి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గుర్తు తెలియని కొందరు అనర్హుల ఫొటోలు, సర్టిఫికెట్లు తీసుకొని అధికారుల అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో ఓటర్లుగా నమోదు చేస్తున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో అనర్హత ఓటర్లను జాబితాల నుంచి తొలగించామన్నారు. ఆయా ఓటర్ల జాబితాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఓటర్ల జాబితాలను పరిశీలించి అనర్హత టర్లను జాబితాల నుంచి తొలగిస్తామన్నారు. అర్హులైన ఓటర్లు అందరూ తమ పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుమని, ఆర్ఐ శేషంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీని, ప్రభుత్వ సీఎస్‌ను కలిసిన మేడా సోదరులు



సీఎస్‌కు బొకే అందజేస్తున్న మేడా సోదరులు, రాజంపేట వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట : రాష్ట్ర ప్రభుత్వం సీఎస్ జవహర్‌రెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో మేడా సోదరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేను అందజేశారు. రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిలు రాజంపేట ప్రాంతంలో నెలకొన్న సమస్యలను సీఎస్‌కు వివరించారు. అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డిని మేడా సోదరులు కలిసి, పలు అంశాల గురించి చర్చించారు. మేడా సోదరుల వెంట కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, ఏపీఐసీసీ డైరక్టరు టి.వేణుగోపాల్‌రెడ్డి, మంత్రి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మేడా రఘు ఆధ్వర్యంలో రాజంపేటకు చెందిన పలువురు నేతలు సీఎంను కలిశారు.

'పల్స్ పోలియో'కు సర్వం సిద్ధం

నందలూరు(రాజంపేట) : మండలంలో మార్చి నెల 3వ తేదీన నిర్వహించబోయే పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన ఓరల్ పోలియో వ్యాక్సిన్, ఐస్ ప్యాక్స్, వ్యాక్సిన్ క్యారియర్లు, సిబ్బంది సర్వం సిద్ధం అని మండల వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ అన్నారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పోలియో చుక్కల సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4800 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 48 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కావున మండల ప్రజలు తమ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు అందరికీ పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థల వారు సహకరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీహెచ్‌ఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులలో అభ్యసనను పెంపొందించుకోవడానికి లిప్ పద్ధతి ద్వారా రీడింగ్, రైటింగ్ స్కిల్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఉపాధ్యాయులు దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి ఈ కార్యక్రమాన్ని విద్యార్థులలో పెంపొందించాలని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని దిన్నెపాడు పర్వతరెడ్డిగారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో వెనుకబడిన విద్యార్థులు చదవడం, రాయడాన్ని అలవాటు చేయాలని, అలాంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లిప్ ద్వారా విద్యార్థుల్లో మార్పు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

చిన్నమండెం : పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం చిన్నమండెం మండలం కేసాపురం గ్రామంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద నూతన వైఎస్ఆర్ జగనన్న కాలనీ నిర్మాణానికి జరిగిన భూమిపూజలో దేవనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో రాయచోటి నియోజకవర్గంలో 20 వేల పక్కా గృహాలు మంజూరయ్యాయని, 93 జగనన్న కాలనీలు నిర్మాణమవుతున్నాయన్నారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అర్హులకు 33 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని గర్వంగా చెప్తున్నామని తెలియజేశారు. జగనన్న కాలనీల్లో సౌకర్యాలను కల్పిస్తూ వారికి అండగా నిలుస్తున్నామన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెట్టింది పేరు వైఎస్ఆర్

చిన్నమండెం : అభివృద్ధి, సంక్షేమానికి పెట్టింది పేరు వైఎస్ఆర్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేసాపురం గ్రామం రెడ్డివారిపల్లె క్రాస్‌లో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వైఎస్ఆర్ హయాంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, అర్హులందరికీ ఇళ్లు, ఉచిత విద్యుత్, రుణమాఫీ తదితర పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలోని ఎన్నో నీటి ప్రాజెక్టులతో పాటు మన ప్రాంతంలోని వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులను నిర్మించిన ఘనత ఆ మహానేతకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఎండీతో ప్రభుత్వ విప్ భేటి



ఏపీఎండీసీ ఎండీతో చర్చిస్తున్న ప్రభుత్వవిప్

ఓబులవారిపల్లె : మంగంపేట గ్రామ కార్మికుల సమస్యలపై ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డితో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు గురువారం విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల ఎండీతో మాట్లాడుతూ మంగంపేట అరుంధతివాడ, కాపుపల్లి, అగ్రహారం గ్రామాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిహారం, అగ్రహారం గ్రామం తరలింపు, భూసేకరణ సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, లోటుపాట్లు సవరించాలని ఎండీతో అన్నారు. అనంతరం పలు సమస్యలపై ఎండీతో చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లో వసతులు ఉండాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

గాలివీడు : మండలంలోని 44 పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని రాయచోటి డివిజన్ ఆర్డీఓ రంగస్వామి గురువారం సిబ్బందికి సూచించారు. మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల్లోని 22 పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పరిశీలించారు. తూముకుంట, వెలిగల్లు, గాలివీడు, అరవీడు, గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు తదితర గ్రామాల్లో 22 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ఈ సందర్భంగా ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట ఇంచార్జ్ తహసీల్దార్ తిమ్మారెడ్డి, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సిద్దవటం : మండలంలోని 26 పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని లింగంపల్లి, కడపాయపల్లి, టక్కోలు, మాచుపల్లి, శాంతినగర్, మూలపల్లి, సిద్దవటం, జంగాలపల్లి, వెలుగుపల్లి, నేకనాపురం, భాకరాపేట, మిట్టపల్లి, పెద్దపల్లి హరిజనవాడ, ఎస్.రాజంపేట, జ్యోతి, వంతాటిపల్లి, పి.కొత్తపల్లి మరికొన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. అక్కడ మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేంద్రం దాడులు దుర్మార్గం

రాయచోటి అర్బన్ : తమ హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేస్తుండడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన రైతు సంఘం నేతలతో కలసి తహసీల్దార్ జయన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగం ఢిల్లీకి తరలివెళ్తే వారిపై పాశవికంగా దాడులు చేయడం తగదన్నారు. బీజేపీ ప్రభుత్వం నేతృత్వంలో పోలీసులు జరిపిన దాడిలో శివకరసింగ్ అనే రైతు చనిపోవడం, 60 మంది రైతులకు గాయాలు కావడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరాయుధులుగా పోరాటం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం టియర్ గ్యాస్ ప్రయోగించడం, కాల్పులు జరపడం కిరాతకమైన చర్యగా అభివర్ణించారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ పాలకులు రైతులకు న్యాయం చేయకపోతే రాబోయే ఎన్నికల్లో రైతుల సత్తా ఏమిటో చూపిస్తామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం నేతలు రామచంద్రారెడ్డి, వెంకటేష్, గోపాల్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో ఏఐటీఎస్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో ఏఐటీఎస్ ఈడీ అభిషేక్‌రెడ్డి

రాజంపేట : శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుటపర్తిలో సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈనెల 19 నుంచి 20 వరకు జరిగిన యూత్ ఫెస్టివల్ – 2024 నిర్వహించిన పోటీలలో ఏఐటీఎస్ విద్యార్థులు కబడ్డీలో తమ ప్రతిభను కనబరిచారు. గురువారం ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ నారాయణ తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను ఏఐటఎస్ ఈడీ చొప్పా అభిషేక్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏఐటీఎస్ కేవలం విద్యలోనే కాకుండా క్రీడ రంగంలోనూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుతోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.నాగమునిలు పాల్గొన్నారు. కబడ్డీలో ఏఐటీఎస్ విద్యార్థులు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.